సాక్షి విశాఖపట్నం
సోమవారం ၊ 25 ၊ నవంబర్ ၊ 2024

నేత్రపర్వం.. నృత్యోత్సవం



కళాభారతి ఆడిటోరియంలో ఆదివారం జరిగిన హేరంబ డ్యాన్స్ ఫెస్టివల్-2024లో నృత్యరూపకాలు అబ్బురపరిచాయి. కూచిపూడి నాట్య ప్రదర్శన నయనమనోహరంగా సాగింది. 8లో

● గిరిజనోత్సవం



బిర్సాముండా 150వ జయంతిని పురస్కరించుకుని బీచ్‌రోడ్డులో గిరిజన స్వాభిమాన ఉత్సవాలు కొనసాగుతున్నాయి. గిరిజన సంస్కృతులు, సంప్రదాయాలను ప్రతిబింబిస్తూ నిర్వహిస్తున్న సాంస్కృతిక మేళా అందరినీ ఆకట్టుకుంది. 8లో

సందర్శన ఆస్వాదన



కార్తీక మాసం నాలుగో ఆదివారం కైలాసగిరి, జూ పార్కు, కంబాలకొండ, ముడసర్లోవ, తెన్నేటి పార్కు, శివాజీ పార్కు తదితర పర్యాటక ప్రాంతాలు సందర్శకులతో కిటకిటలాడాయి. వేలాది మంది సందర్శకులు, నగర ప్రజలు వన భోజనాలు చేసి.. ఆటపాటలతో రోజంతా సరదాగా గడిపారు. కైలాసగిరిపై ప్రధాన ద్వారం, శివపార్వతుల విగ్రహాలు, ఐ లవ్ వైజాగ్ పాయింట్‌ల వద్ద ఫొటోలు దిగారు. కాగా.. జూ పార్కును ఆదివారం 13,650 మంది సందర్శించినట్లు ఇన్‌చార్జి క్యూరేటర్ జి.మంగమ్మ తెలిపారు. సందర్శకుల ద్వారా రూ.9,61,724 ఆదాయం లభించినట్లు వెల్లడించారు. అలాగే కంబాలకొండ ఎకో టూరిజం పార్కు సందర్శకులతో కళకళలాడింది. అధిక సంఖ్యలో ప్రజలు వన భోజనాలు చేశారు. ఇక్కడ కొలనులో కయాకింగ్ చేస్తూ సందడి చేశారు. సుమారు 1,500 మంది కంబాలకొండను సందర్శించగా.. రూ 1.10 లక్షల ఆదాయం లభించింది. - ఆరిలోవ



రైల్వే జోన్‌పై తొండాట



ప్రధాని శంకుస్థాపన చేయనున్న ప్రాజెక్టులు

- దువ్వాడ-ఉత్తర సింహాచలం స్టేషన్ల మధ్య 3, 4 లైన్ల నిర్మాణం.
- పెందుర్తి నుంచి ఉత్తర సింహాచలం మధ్య ఫ్లైఓవర్ నిర్మాణం
- విజయనగరం-కొత్తవలస మధ్య 4వ రైల్వే లైన్ నిర్మాణం

టెండర్లకు సై.. శంకుస్థాపనకు నై!

- జోన్ కార్యాలయ నిర్మాణానికి టెండర్లు పిలిచిన రైల్వే బోర్డు
- ప్రధాని పర్యటనలో శంకుస్థాపన వద్దంటూ తొలగించేసిన కూటమి నేతలు
- వాల్తేరు డివిజన్ పరిధిలో రూ.450 కోట్లతో మూడు ప్రాజెక్టుల శంకుస్థాపనకు ఏర్పాట్లు

సాక్షి, విశాఖపట్నం : దశాబ్దాల కలగా మిగిలిన దక్షిణ కోస్తా రైల్వే జోన్‌పై కూటమి ప్రభుత్వం తొండాట ఆడుతోంది. జోన్ ప్రధాన కార్యాలయానికి సంబంధించిన టెండర్లను రైల్వే బోర్డు ఆహ్వానించినా.. ప్రధాని మోదీ పర్యటనలో శంకుస్థాపనకు మాత్రం కూటమి సర్కారు మోకాలడ్డింది. ఈనెల 29న జరగాల్సిన జోన్ ఫౌండేషన్ స్టోన్ పనులను వాయిదా వేయాలంటూ అధికార పార్టీకి చెందిన నేతలు పట్టుబట్టడంతో మరోసారి 'జోన్'కు గ్రహణం పట్టింది. అయితే మొత్తం రూ.450 కోట్ల విలువైన రైల్వే పనులకు మాత్రం ప్రధాని మోదీ శంకుస్థాపన చేయనున్నారు.

నాడు శిలాఫలకం దాచేసి.. భూమి పేరుతో డ్రామాలు చేసి..

విశాఖపట్నం కేంద్రంగా సౌత్ కోస్ట్ రైల్వే జోన్ ఏర్పాటుకు 2019లో కేంద్రం పచ్చజెండా ఊపింది. జోన్‌కు సంబంధించిన డీపీఆర్‌ని అదే ఏడాది చివర్లో ఇచ్చేశారు. కానీ ఇంతవరకూ కార్యరూపం దాల్చలేదు. కేవలం రాజకీయ కక్షతోనే జోన్‌ని ఆపేశారు. ముందుగా 2022లో జోన్ ప్రధాన కార్యాలయ నిర్మాణానికి డీఆర్ఎం కార్యాలయం ఎదురుగా ఉన్న వైర్‌లెస్ కాలనీని ఎంపిక చేశారు. వైర్‌లెస్ కాలనీలో ఉన్న 13 ఎకరాల్లో 8 ఎకరాల విస్తీర్ణంలో హెడ్‌క్వార్టర్స్‌కు సంబంధించి డిజైన్లకు రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఆమోదముద్ర వేశారు. కాలనీని సైతం పరిశీలించారు. రూ.106 కోట్ల వ్యయంతో జోన్ ప్రధాన కార్యాలయానికి టెండర్లు పిలిచేందుకు సన్నద్ధమయ్యారు. టెండర్లు ఖరారు చేసిన తర్వాత అగ్రిమెంట్ జరిపి.. 36 నెలల్లో భవనాన్ని పూర్తి చేయాలని రైల్వే అధికారులు భావించారు. 2022 నవంబర్ 12న ప్రధాని మోదీ వర్చువల్‌గా శంకుస్థాపన చేస్తారనీ.. శిలాఫలకం కూడా సిద్ధం చేశారు. కానీ 11వ తేదీ అర్ధరాత్రి 12 గంటల తర్వాత.. హఠాత్తుగా జోన్ శంకుస్థాపన కార్యక్రమాన్ని వాయిదా వేసేశారు. సిద్ధం చేసిన శిలాఫలకాన్ని దాచేశారు. అప్పుడు శంకుస్థాపన చేస్తే.. క్రెడిట్ అంతా అధికారంలో ఉన్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి దక్కుతుందనే రాజకీయ కుట్రతో ఉత్తరాంధ్ర వాసుల కలలను కల్లలు చేసేశారు. తర్వాత ముంపు భూమి పేరుతో రాజకీయాలు చేసి ప్రజలను మోసం చేశారు.

మరోసారి వాయిదా

ఇప్పుడు మరోసారి అదే మోసం చేసేందుకు కూటమి నేతలు సిద్ధమవుతున్నారు. ఈసారి రాజకీయ కక్షతో కాకుండా ఎన్నికల స్టంట్ కోసం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నెల 29న ప్రధాని మోదీ విశాఖలో పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో పలు ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు ప్రధాని చేతుల మీదుగా జరగనున్నాయి. దీనికి సంబంధించి వివిధ శాఖల నుంచి ప్రతిపాదనలు వెళ్లాయి. రైల్వే నుంచి కూడా నాలుగు ప్రాజెక్టులకు సంబంధించిన ప్రతిపాదనలు పంపించగా.. పీఎంవో వాటన్నింటినీ ఆమోదించింది. ఇందులో సౌత్ కోస్ట్ రైల్వే జోన్ శంకుస్థాపన కార్యక్రమం కూడా ఉంది. ఈ విషయం తెలుసుకున్న కూటమి నేతలు.. జోన్ శంకుస్థాపనని వాయిదా వేయాలని పట్టుబట్టారు. జమిలి ఎన్నికల ముందు చేస్తే.. ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లగలమని పీఎంవో ముందు ఏకరువు పెట్టినట్లు తెలుస్తోంది. ఇప్పుడు శంకుస్థాపన చేస్తే ప్రజలు మర్చిపోతారంటూ చెప్పినట్లు సమాచారం. రాష్ట్ర కూటమి నేతల ఒత్తిళ్ల నేపథ్యంలో జోన్ శంకుస్థాపన కార్యక్రమాన్ని తొలగించాలంటూ 23వ తేదీ అర్ధరాత్రి వాల్తేరు రైల్వే డివిజన్ అధికారులకు పీఎంవో నుంచి ఆదేశాలు వచ్చాయి. దీంతో మిగిలిన మూడు ప్రాజెక్టులను మాత్రమే ప్రధాని కార్యక్రమంలో పొందుపరిచారు. రైల్వే జోన్‌ను ఉత్తరాంధ్ర ప్రజల కలల ప్రాజెక్టుగా చూడకుండా కేవలం రాజకీయ లబ్ధి కోసం వాడుకోవడం కూటమి నేతలకే చెల్లింది. మొత్తంగా ప్రధాని పర్యటనలో వాల్తేరు డివిజన్‌కు సంబంధించి సుమారు రూ.450 కోట్ల అంచనా వ్యయంతో 3 ప్రాజెక్టులకు శంకుస్థాపన జరగనుంది. ఇందులో దువ్వాడ-ఉత్తర సింహాచలం స్టేషన్ల మధ్య 3, 4 లైన్ల నిర్మాణం, సర్ఫేస్ లెవల్ క్రాసింగ్ ఇబ్బందులు తొలగించేలా.. పెందుర్తి నుంచి ఉత్తర సింహాచలం మధ్య ఫ్లైఓవర్ నిర్మాణం, విజయనగరం-కొత్తవలస మధ్య 4వ రైల్వే లైన్ నిర్మాణ పనులకు ప్రధాని మోదీ శంకుస్థాపన చేయనున్నారని రైల్వే వర్గాలు వెల్లడించాయి.

2 నుంచి మార్గశిర మాసోత్సవాలు



డాబాగార్డెన్స్: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో డిసెంబర్ 2 నుంచి 30వ వరకు మార్గశిర మాసోత్సవాలను వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ఏఈవో కె.తిరుమలేశ్వరరావు తెలిపారు. మార్గశిరమాసంలో ప్రతీ గురువారం పంచామృతాభిషేకాలు నిర్వహిస్తామని, ఇందులో పాల్గొనాలనుకునే భక్తులు రూ.7,500 చెల్లించాలని తెలిపారు. గురువారం మినహా మిగిలిన రోజుల్లో పంచామృతాభిషేకంలో పాల్గొనదలిచే భక్తులు రూ.2,500 పూజా రుసుం చెల్లించాలన్నారు. ప్రతి శుక్రవారం నిర్వహించే క్షీరాభిషేకానికి రూ.1,116 చెల్లించాలని, ఆయా పూజల్లో పాల్గొనదలచే భక్తులు పూజా రుసుమును ముందుగా చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని తెలియజేశారు. ఆన్‌లైన్ ద్వారా www.aptemples.ap.gov.in వెబ్‌సైట్‌లో బుక్ చేసుకోవాలని పేర్కొన్నారు. నేరుగా టికెట్లు తీసుకునేవారి కోసం ఆలయ కౌంటర్లలోనూ టికెట్లు అందుబాటులో ఉంచామన్నారు.

నేడు జీవీఎంసీలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక

డాబాగార్డెన్స్: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సోమవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంతో పాటు అన్ని జోనల్ కార్యాలయాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్ సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు ఈ కార్యక్రమం ఉంటుందని, నగర ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని పేర్కొన్నారు.

ప్రధాని పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

- 29న ఏయూ మైదానంలో బహిరంగ సభ, రోడ్ షో
- వివిధ ప్రాజెక్టులకు శంకుస్థాపన చేయనున్న ప్రధాని



మాట్లాడుతున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్, చిత్రంలో సీపీ బాగ్చి, విశాఖ ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యేలు

మహారాణిపేట: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఈనెల 29వ తేదీన విశాఖ పర్యటన నేపథ్యంలో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. ఆదివారం ఆయన కలెక్టరేట్‌లో స్థానిక ప్రజా ప్రతినిధులు, వివిధ విభాగాల ఉన్నతాధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో భారీ బహిరంగ సభ, రోడ్ షో గురించి ఎంపీ ఎం.శ్రీభరత్, ప్రభుత్వ విప్ గణబాబు, ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, పి.విష్ణుకుమార్ రాజు, పంచకర్ల రమేష్ బాబు, అధికారులతో చర్చించారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి వీఐపీల రాక, ప్రధాన మంత్రికి స్వాగతం ఏర్పాట్లు, ప్రజలకు తాగునీరు, ఆహారం, ఇతర వసతుల కల్పన తదితర అంశాలపై ప్రజా ప్రతినిధులు, అధికారులు సలహాలు, సూచనలు అందజేశారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రజాప్రతినిధులు, అధికారులు సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్ కుమార్, జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, డీఆర్వో భవానీ శంకర్, ఆర్డీవోలు పి.శ్రీలేఖ, సంగీత్ మాధుర్, డీసీపీలు, ఇతర రెవెన్యూ, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

ప్రధాని పర్యటన ఇలా..

ప్రధాని మోదీ ఈ నెల 29వ తేదీ మధ్యాహ్నం 3.40 గంటలకు ప్రత్యేక విమానంలో తూర్పు నౌకాదళానికి చెందిన ఎయిర్‌బేస్ ఐఎన్ఎస్ డేగాకు చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో కాన్వెంట్ జంక్షన్, రైల్వే స్టేషన్, సంపత్ వినాయగర్ టెంపుల్, టైకూన్, సిరిపురం జంక్షన్ మీదుగా ఎస్పీ బంగ్లా రోడ్డు నుంచి వేదిక వద్దకు 4.40 గంటలకు వస్తారు. ఈ క్రమంలో టైకూన్ జంక్షన్ నుంచి ఎస్పీ బంగ్లా వరకు రోడ్‌షోలో పాల్గొంటారు. ప్రజలకు అభివాదం చేసుకుంటూ ఏయూ మైదానంలో బహిరంగ సభకు చేరుకుంటారు. బహిరంగ సభలో రాష్ట్ర గవర్నర్, ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రులతో కలిసి పాల్గొంటారు. ఈ సందర్భంగా ఎన్‌టీపీసీ గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టుతో పాటు, రైల్వే లైన్లు, మొదలైన వివిధ ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల్ని ప్రధాని చేయనున్నారు. సీఎం, డిప్యూటీ సీఎం ప్రసంగాల అనంతరం సాయంత్రం 5.25 నుంచి 5.43 గంటల వరకు ప్రజలనుద్దేశించి ప్రధాని ప్రసంగించనున్నారు. సాయంత్రం 5.45 గంటలకు సభా వేదిక నుంచి ఎయిర్ పోర్టుకు తిరుగుపయనమవుతారు. అక్కడి నుంచి ప్రత్యేక విమానంలో ఢిల్లీకి చేరుకోనున్నారు.

పంచ వైష్ణవ క్షేత్ర దర్శినికి ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు

డాబాగార్డెన్స్: మార్గశిరమాసంలో భక్తుల సౌకర్యార్థం పంచ వైష్ణవ క్షేత్ర దర్శినికి ప్రత్యేక సర్వీసులు నడపనున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి బి.అప్పలనాయుడు తెలిపారు. మార్గశిర మాసంలో వచ్చే 7, 14, 21, 18 తేదీల్లో రాత్రి 9 గంటలకు ద్వారకా బస్‌స్టేషన్ నుంచి బస్సులు బయలుదేరుతాయని చెప్పారు. ద్వారకాతిరుమల(శ్రీ వేంకటేశ్వర స్వామి), అంతర్వేది(శ్రీలక్ష్మీ నరసింహస్వామి), అప్పన్నపల్లి(శ్రీ బాల బాలాజీ), గొల్లల మామిడాడ(కోదండ రామాలయం), అన్నవరం(శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి) పుణ్యక్షేత్రాలను దర్శించుకుని తిరిగి విశాఖ రావడంతో ఈ యాత్ర ముగుస్తుంది. ప్రయాణ చార్జీ(సూపర్ లగ్జరీ) ఒక్కొక్కరికీ రూ.1,800గా నిర్ణయించారు. https://www.apsrtconline.inలో పంచ వైష్ణవ క్షేత్ర దర్శిని రూట్ సెలెక్ట్ చేసి సీట్లు రిజర్వ్ చేసు కోవచ్చు. అలాగే ద్వారకా బస్‌స్టేషన్‌లోని రిజర్వేష న్ కౌంటర్‌లో టికెట్లు అందుబాటులో ఉంటాయని అప్పలనాయుడు తెలిపారు. మరిన్ని వివరాలకు 99592 25602, 90522 27083, 99592 25594, 91001 09731లో సంప్రదించవచ్చు. కాగా.. కార్తీకమాసంలో పంచారామాల దర్శనంలో భాగంగా ఆదివారం ద్వారకా బస్‌స్టేషన్ నుంచి 11 ఆర్టీసీ బస్సులు బయలుదేరాయి. ఈ బస్సులను జిల్లా ప్రజా రవాణా అధికారి బి.అప్పలనాయుడు ప్రారంభించారు.

ఏయూ.. అస్తవ్యస్తం



కూటమి పాపం.. వర్సిటీకి శాపం

- వైస్ చాన్సలర్ నియామకంపై తేలని పంచాయితీ
- ఇన్‌చార్జిల పాలనలో అంతా స్తబ్దత
- కీలక నిర్ణయాలపై అధికారుల వెనకడుగు
- వర్సిటీ శతాబ్ది ఉత్సవాల ఊసే లేదు

విశాఖ విద్య: శతాబ్ది ఉత్సవాలకు సిద్ధమవుతున్న తరుణంలో కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు ఆంధ్రా యూనివర్సిటీకి శాపంగా పరిణమిస్తున్నాయి. అధికారంలోకి వచ్చిన తర్వాత వైస్ చాన్సలర్ ప్రసాదరెడ్డిపై తీవ్రమైన ఒత్తిడి తీసుకొచ్చి రాజీనామా చేయించిన పాలకులు.. ఆ స్థానంలో రెగ్యులర్ అధికారిని నియమించలేదు. దీంతో వర్సిటీ ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ గొట్టాపు శశిభూషణరావు ఇన్‌చార్జి వీసీగా వ్యవహరిస్తున్నారు. రిజిస్ట్రార్‌తో పాటు వర్సిటీలోని దాదాపు అన్ని విభాగాల అధిపతులను కూడా ఉన్నపాటున మార్చేశారు. ఇదే క్రమంలో రెగ్యులర్ వీసీ నియామక ప్రక్రియకు రాష్ట్ర ప్రభుత్వం తెరలేపడంతో పాలనాధికారుల్లో స్తబ్దత నెలకొంది. హెచ్‌వోడీలుగా సీట్లలో కూర్చొన్నా.. కొత్త వీసీ వస్తే మళ్లీ మార్పులు చేర్పులు ఉంటాయనే ప్రచారంతో కీలక నిర్ణయాలు తీసుకునేందుకు అంతా వెనుకంజ వేస్తున్నారు.

వందేళ్ల ఉత్సవాల ప్రణాళిక ఏదీ?

ఆంధ్ర విశ్వవిద్యాలయానికి ఎంతో చారిత్రక నేపథ్యం ఉంది. 2025 ఏప్రిల్ నాటికి వర్సిటీ వందో ఏట అడుగుపెట్టనుంది. ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో ఉస్మానియా తర్వాత శతాబ్ది ఉత్సవాలు చేసుకునేది ఆంధ్ర యూనివర్సిటీనే కావడం గమనార్హం. ఇతర దేశాలకు చెందిన విద్యార్థులు కూడా చదువులు సాగిస్తున్న నేపథ్యంలో వర్సిటీ చరిత్ర ప్రపంచానికి చాటేలా శతాబ్ది ఉత్సవాలను నిర్వహించాలని ప్రసాదరెడ్డి వీసీగా ఉన్న సమయంలో ఆలోచన చేశారు. ప్రారంభ వేడుకలకు దేశ ప్రధాని, గవర్నర్, ముగింపు రోజున రాష్ట్రపతిని ఆహ్వానించేలా ముందస్తు కార్యాచరణకు సిద్ధమయ్యారు. కానీ ప్రస్తుతం రెగ్యులర్ వీసీ లేకపోవడంతో శతాబ్ది ఉత్సవాల ఊసే లేకుండా పోయింది.

వీసీ నియామకం ఇప్పట్లో తేలేనా?

వర్సిటీకి పూర్తి స్థాయి వీసీ నియామకం ఇప్పట్లో తేలేలా కనిపించడం లేదు. వీసీ పోస్టు కోసం రాష్ట్ర వ్యాప్తంగా వంద మందికి పైగానే ఆశావాహులు దరఖాస్తు చేసుకున్నట్లు తెలుస్తోంది. ఇందులో ఏయూలో పనిచేస్తున్న అధ్యాపకులు కూడా ఉన్నారు. వీరిలో ఆ ఒక్కరు ఎవరనేది సెర్చ్ కమిటీ తేల్చాల్సి ఉంది. వర్సిటీ తరఫున ఒకరు, యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్(యూజీసీ) నుంచి ఒకరు, రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఒకరు.. ఇలా ముగ్గురు సభ్యులతో కూడిన సెర్చ్ కమిటీ వీసీ పోస్టుకు అన్ని అర్హతలు కలిగిన ముగ్గురు పేర్లను సిఫారసు చేయాలి. వీరిలో ఒకరిని వైస్ చాన్సలర్‌గా రాష్ట్ర ప్రభుత్వ సిఫారసు మేరకు గవర్నర్ నియమిస్తారు. కానీ సెర్చ్ కమిటీ కూర్పు ఇంకా జరగలేదు. శతాబ్ది ఉత్సవాలు ముంచుకొస్తున్న వేళ వర్సిటీకి రెగ్యులర్ వీసీ నియామకం జరిగే పరిస్థితులు కనిపించడం లేదని అధ్యాపకులు సైతం అంటున్నారు.

బయట వ్యక్తుల పెత్తనం

చదువుల కోవెలగా విరాజిల్లుతున్న విశ్వవిద్యాలయంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చోటుచేసుకుంటున్న పరిణామాలపై విద్యావేత్తలతో పాటు, వర్సిటీ అధ్యాపకులు సైతం విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ప్రసాదరెడ్డి వీసీగా ఉన్న సమయంలో పాలనా వ్యవహారాలతో పాటు, క్యాంపస్ చదువులపై కూడా పూర్తి స్థాయిలో పర్యవేక్షణ ఉండేది. ప్రస్తుతం ఇన్‌చార్జిలతో వర్సిటీ పాలన ఒకడుగు ముందు కు పదడుగులు వెనక్కి అన్నట్లుగా ఉంది. ఎయిడెడ్ కాలేజీల నుంచి వచ్చిన అధ్యాపకులను వారి మాతృస్థానాలకు పంపించడం అనేది రాష్ట్ర ప్రభుత్వ స్థాయిలో జరగాల్సిన నిర్ణయం. ఇలాంటి పాలనా వ్యవహారాల్లో కొంతమంది జోక్యం చేసుకుంటూ వైషమ్యాలు సృష్టిస్తున్నారు. కొన్ని విద్యార్థి సంఘాలు సైతం పాలనలో జోక్యం చేసుకుంటూ ధర్నాలు చేస్తుండటం వెనుక బయట వ్యక్తుల ప్రోద్బలం ఉందనే ప్రచారం జరుగుతోంది. ఈ మొత్తం పరిణామాలతో వర్సిటీ ప్రతిష్టతోపాటు, చదువులు కూడా మసకబారే ప్రమాదం ఉందని విద్యావేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పనివేళల పెంపుతో పరేషాన్



- పాఠశాలల పనివేళల్లో మార్పులపై ఉపాధ్యాయుల్లో వ్యతిరేకత
- విద్యార్థుల తల్లిదండ్రుల ఆందోళన
- నేటి నుంచి 11 స్కూళ్లలో పనివేళల మార్పు

మారిన పాఠశాల వేళలు

ఉదయం 9 గంటలకు — బడిగంట
9.05 నుంచి 9.25 వరకు — ప్రార్థన
9.25 నుంచి మధ్యాహ్నం 12.45 వరకు — నాలుగు పీరియడ్లు
12.45 నుంచి 1.45 వరకు — లంచ్ బ్రేక్
1.45 నుంచి సాయంత్రం 5 వరకు — నాలుగు పీరియడ్లు

ఎంపిక చేసిన స్కూళ్లు

- జెడ్పీ హైస్కూల్, గిడిజాల
- జెడ్పీ హైస్కూల్, చిట్టివలస
- జెడ్పీ హైస్కూల్, అడవివరం
- జెడ్పీ హైస్కూల్, అగనంపూడి
- జెడ్పీ హైస్కూల్, రెడ్డిపల్లి
- జెడ్పీ హైస్కూల్, నడుపూరు
- జెడ్పీ హైస్కూల్, వేపగుంట
- జీవీఎంసీ హైస్కూల్, ప్రకాశరావుపేట
- జీవీఎంసీ హైస్కూల్, శ్రీహరిపురం
- జీవీఎంసీ హైస్కూల్, మాధవధార
- కేడీపీఎం హైస్కూల్, చినవాల్తేరు

విశాఖ విద్య: చదువుల్లో ప్రయోగం పేరిట ప్రభుత్వ స్కూళ్ల పనివేళల మార్పుపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని 11 ఉన్నత పాఠశాలలను ఎంపిక చేసిన జిల్లా విద్యాశాఖాధికారులు, ఈ నెల 25 నుంచి పనివేళల మార్పును అమలు చేసేందుకు కసరత్తు చేస్తున్నారు. ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలో మండలానికి ఒక హైస్కూల్‌ను పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసినట్లు అధికారులు చెబుతున్నారు. అయితే క్షేత్రస్థాయిలో ఎటువంటి కసరత్తు లేకుండా స్కూళ్ల ఎంపిక చేయటంపై ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు లోలోన రగిలిపోతున్నారు.

సాయంత్రం వేళ ఇంటికి వెళ్లేదెలా..

స్కూళ్ల నిర్వహణ టైమింగ్స్ మార్పుతో ఉపాధ్యాయులే కాకుండా విద్యార్థులు, వారి తల్లిదండ్రుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. సాయంత్రం 5 గంటలకు స్కూల్ విడిచి పెడితే దూరప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులు ఇళ్లకు చేరుకోవడం ఇబ్బందికరమేనని తల్లిదండ్రులు అభిప్రాయపడుతున్నారు. జిల్లాలోని శివారు ప్రాంతాల్లో గల స్కూళ్లకు ఏడెనిమిది కిలోమీటర్ల దూరం నుంచి కూడా విద్యార్థులు వస్తుంటారు. ప్రస్తుత చలికాలంలో సాయంత్రం 5 గంటలకే చీకట్లు అలుముకుంటున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో మరీ ముఖ్యంగా బాలికలు స్కూల్ నుంచి ఇంటికి సేఫ్‌గా వచ్చే పరిస్థితి ఉంటుందా? అని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు.

సామాజిక మాధ్యమాల్లో జోరుగా సెటైర్లు

పాఠశాలల పనివేళలు మార్పు చేస్తూ కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై సామాజిక మాధ్యమాల్లో జోరుగా సెటైర్లు చక్కర్లు కొడుతున్నాయి. డీఏ లేదు.. ఐఆర్ ఊసే లేదు.. బకాయిలు చెల్లింపు పట్టించుకునే వారే లేరు.. కానీ అదనపు పనిభారం మోపేలా ఇదేం తీరు అంటూ కామెంట్లు చేస్తున్నారు. ఉపాధ్యాయ కమ్యూనిటీ వాట్సాప్ గ్రూపుల్లో ఇదే చర్చ జోరుగా సాగుతోంది.

ప్రభుత్వం పునరాలోచించాలి



క్షేత్రస్థాయిలో పరిస్థితులపై ఉపాధ్యాయుల అభిప్రాయ సేకరణ లేకుండా ఒంటెద్దు పోకడతో నిర్ణయాలు తీసుకోవటం వల్ల విద్యారంగానికి నష్టం చేకూరే ప్రమాదం ఉంది. ప్రభుత్వం చెబుతున్నది ఒకటైతే, ఆచరణలో మాత్రం మరోలా ఉంది. ఇలాంటి నిర్ణయాలపై పునరాలోచన చేయాలి.
– బి.ఆర్.అంబేద్కర్, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి

ఇది ప్రయోగాత్మకం మాత్రమే..

పాఠశాలల పనివేళలు మార్పు అనేది ప్రయోగాత్మకం మాత్రమే. ఈ నెల 25 నుంచి 30 వరకు జిల్లాలో ఎంపిక చేసిన స్కూళ్లలో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహిస్తాం. ఆయా స్కూళ్లలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రుల అభిప్రాయాలను తీసుకుని ఉన్నతాధికారులకు నివేదిస్తాం. ఉన్నతాధికారుల ఆదేశాలకు అనుగుణంగా తదుపరి చర్యలు ఉంటాయి.
– ప్రేమ్‌కుమార్, జిల్లా విద్యాశాఖాధికారి

సాక్షి స్పెల్ బీ, మ్యాథ్ బీలకు విశేష స్పందన


స్పెల్ బీ పరీక్ష రాస్తున్న విద్యార్థులు


మ్యాథ్ బీ పరీక్ష రాస్తున్న విద్యార్థులు

తాటిచెట్లపాలెం: 'సాక్షి'మీడియా ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన స్పెల్ బీ, మ్యాథ్ బీ పరీక్షలకు విశేష స్పందన లభించింది. ఇంతవరకు పలు రౌండ్లలో ఎంపిక చేసిన విద్యార్థులకు నాలుగు కేటగిరీల్లో తాటిచెట్లపాలెంలోని విశ్వతేజ స్కూల్‌లో క్వార్టర్ ఫైనల్స్ నిర్వహించారు. స్పెల్ బీలో మొత్తం 147 మంది, మ్యాథ్స్ బీలో 181 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారు వచ్చే నెలలో జరిగే సెమీఫైనల్స్‌కు అర్హత సాధిస్తారని 'సాక్షి'బ్రాంచ్ మేనేజర్ చంద్రరావు తెలిపారు. పోటీతత్వాన్ని పెంపొందించేలా నిర్వహిస్తున్న పరీక్షలు కావడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఎంతో ఆసక్తి కనబరిచి.. వారే స్వయంగా తమ పిల్లలను పరీక్ష కేంద్రానికి తీసుకొచ్చారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో పాఠశాల ఆవరణలో సందడి నెలకొంది.

కొత్త పదాలు తెలుసుకున్నా..



స్పెల్ బీలో క్వార్టర్ ఫైనల్‌కు చేరుకోవడం సంతోషంగా ఉంది. 'సాక్షి' స్పెల్ బీ ద్వారా కొత్త ఇంగ్లిష్ పదాలతో పాటు వాటి అర్థాలు తెలుసుకున్నాను. ఇంగ్లిష్ నైపుణ్యాలు మెరుగుపరుచుకోవడానికి ఇటువంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయి. 'సాక్షి'కి థ్యాంక్స్.

-పి.లోహిత, 4వ తరగతి విద్యార్థిని

పరీక్ష బాగా రాశాను



నేను వీటీ హైస్కూల్‌లో 2వ తరగతి చదువుతున్నాను. ఇంత వరకు నిర్వహించిన రౌండ్లలో విజయం సాధించి క్వార్టర్ ఫైనల్‌కు చేరుకోవడం సంతోషంగా ఉంది. పరీక్ష బాగా రాశాను. సెమీ ఫైనల్‌కు వెళ్తాననే నమ్మకం ఉంది.

- పి.షైనీ, వీటీ హైస్కూల్

'సాక్షి'కి ధన్యవాదాలు



'సాక్షి'ఆధ్వర్యంలో మా పాఠశాలలో స్పెల్ బీ, మ్యాథ్ బీ పరీక్షలు నిర్వహించడం ఆనందంగా ఉంది. ఇటువంటి పోటీల వల్ల విద్యార్థులు ఇంగ్లిష్, మ్యాథ్స్‌లో మరింత పట్టు సాధించగలరు. 'సాక్షి'ఆధ్వర్యంలో ఏటా క్రమం తప్పకుండా ఇటువంటి పోటీలు నిర్వహించడం అభినందనీయం. 'సాక్షి'కి ధన్యవాదాలు. ఇటువంటి పోటీల్లో పాల్గొనేలా విద్యార్థులను వారి తల్లిదండ్రులు ప్రోత్సహించాలి.

- ఐ.భాస్కరరావు, ప్రిన్సిపాల్, విశ్వతేజ స్కూల్

ప్రకృతి ఒడిలో.. పరవశ జడిలో..

నిశ్శబ్దానికి నిర్వచనంగా నిలిచే పరిసరాలు.. సూర్యకాంతి పడి ముత్యంలా మెరిసే మంచు బిందువులు.. అప్పుడే రెక్కలు విచ్చుకుని ఎగరడానికి సిద్ధమైన పక్షులు.. ప్రాణవాయువంతా ఇక్కడే కొలువై ఉందా అన్నట్లున్న చిట్టడివి.. ఇటువంటి ప్రకృతి ఊయలలో విహరించడం ఎన్నో మధుర జ్ఞాపకాలను మిగులుస్తుంది. ఇందుకోసం ఏజెన్సీకే వెళ్లనవసరం లేదు. నగరం మధ్యలో.. ఎండాడ వద్ద ఉన్న జీవ వైవిధ్య పార్కు నుంచి నాలుగు కిలోమీటర్ల మేర తూర్పు కనుమల్లో ప్రయాణం కొత్త అనుభూతులను అందిస్తుంది. ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌పీరియన్స్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం సుమారు 20 మంది ప్రకృతిని ఆస్వాదిస్తూ చేసిన ట్రెకింగ్ అద్భుతంగా సాగింది.

– ఏయూక్యాంపస్


ట్రెకింగ్‌లో పాల్గొన్న నగరవాసులు

- తూర్పు కనుమల్లో ఉత్సాహంగా సాగిన ట్రెకింగ్
- నాలుగు కిలోమీటర్ల మార్గంలో ఎన్నో అనుభూతులు


యానిమల్ రెస్క్యూ కేంద్రం వద్ద కనిపించిన చుక్కల జింకలు

వారాంతాన్ని సరికొత్తగా గడపాలనుకున్న ప్రకృతి ప్రేమికులు సూర్యుడి కంటే ముందే ఎండాడ వద్ద ఉన్న తూర్పు కనుమల జీవవైవిధ్య పార్కు వద్ద కలుసుకున్నారు. ముందుగా తూర్పు కనుముల జీవ వైవిధ్య పార్కులో ప్రత్యేకతలు, పరిసరాలు తెలుసుకున్నారు. అక్కడ నుంచి అడవిలో వీరి ప్రయాణం ప్రారంభమైంది. దట్టమైన వృక్షాల నడుమ ఆరోగ్యకర నడక సాగింది. ఆకుపచ్చని పరిసరాలు తప్ప మరేదీ కనుచూపు మేరలో కనిపించని వనంలో సాగిన వీరి ప్రయాణం ఆరోగ్యాన్నే కాకుండా.. ఎన్నో అనుభవాలు, అనుభూతులను మూటగట్టి ఇచ్చింది. పక్షుల కిలకిలారావాలు వీరికి స్వాగతం పలకగా.. మధ్యలో చుక్కల జింకలు వీరిని ఆప్యాయంగా పలకరించాయి. సప్తవర్ణాల సీతాకోక చిలుకలు వీరి ప్రయాణాన్ని రంగులమయంగా మార్చాయి.

వర్షాకాలం తర్వాత తొలి అడుగు



వర్షాకాలం తర్వాత తొలిసారి ట్రెకింగ్ నిర్వహించాం. పిల్లల నుంచి పెద్దల వరకు ప్రకృతి ప్రేమికులు ఈ నడకలో పాల్గొన్నారు. రస్టిస్పాటెడ్ క్యాట్(చిన్నగా ఉండే వైల్డ్ క్యాట్), జంగిల్ క్యాట్(బావురుపిల్లి), ముళ్లపంది, పునుగుపిల్లి(చెట్టుపిల్లి), కొండ గొర్రెలు(బార్కింగ్ డీర్)లు ఈ ప్రాంతంలో సంచరించిన ఆనవాళ్లు కనిపించాయి. దాదాపు నాలుగు గంటలకు పైగా అడవిలో మా ఈ ప్రయాణం ఉత్సాహంగా సాగింది. కొండపై నుంచి చుట్టూ ఉన్న ప్రకృతిని చూస్తూ అందరూ ఎంతో తన్మయత్వానికి లోనయ్యారు.

– టి.ఎస్.ప్రణవ్, ఈస్ట్ కోస్ట్ కన్జర్వేషన్ టీం

ప్రకృతిని ఆస్వాదించాను



ఇప్పటివరకు పుస్తకాల్లో చదువుకున్నవి.. వివిధ మాధ్యమాల్లో విన్నవి నేడు అనుభవపూర్వకంగా ఆస్వాదిస్తూ తెలుసుకున్నాను. ఇక్కడి ప్రత్యేకతలను తెలిపే విధంగా కరపత్రాలు, సమాచార పుస్తకాలు ముద్రించి అందుబాటులో ఉంచాలి. తద్వారా ట్రెకింగ్‌కి వచ్చిన వారికి ఉపయుక్తంగా నిలుస్తుంది. చెట్లు, పుష్పాలు, జీవ జాతుల గురించి తెలుసుకోవాలనే ఆసక్తి వారిలో కలుగుతుంది.

– డాక్టర్ ప్రదీప్ కె.డి, సైంటిస్ట్, ఎం.ఎస్ స్వామినాథన్ ఫౌండేషన్

విద్యా సంస్థలు ప్రోత్సహించాలి



సోషల్ సైన్సెస్, ట్రైబల్ స్టడీస్, బోటనీ, జువాలజీ, టూరిజం వంటి కోర్సులను అభ్యసించే విద్యార్థులకు ఇటువంటి ప్రయాణం ప్రత్యక్ష ప్రయోగశాలగా నిలుస్తుంది. మన చుట్టూ ఉన్న సహజ వనరులపై అవగాహన కలుగుతుంది. అదే సమయంలో ప్రకృతితో అనుబంధం ఏర్పడుతుంది. తద్వారా అటవీ జాతుల పరిరక్షణ, సంరక్షణ సాధ్యపడుతుంది. సిలబస్‌లో ఇటువంటివి భాగం చేయాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా విద్యాసంస్థలు ఈ తరహా కార్యక్రమాలను ప్రోత్సహించాలి. అరుదైన ఔషధ మొక్కలు వంటివి వారి నుంచి తెలుసుకునే అవకాశం ఏర్పడుతుంది.

– డాక్టర్ డి.దివ్య, అసిస్టెంట్ ప్రొఫెసర్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ట్రైబల్ స్టడీస్, సీటీయూ, ఏపీ

కుటుంబంతో కలిసి వచ్చాం



ప్రకృతి యాత్రలో నేను కుటుంబంతో కలిసి పాల్గొన్నాను. ఎత్తైన ప్రాంతం నుంచి చుట్టూ ఆకుపచ్చని పరిసరాలు ఎన్నో అనుభూతులను మిగిల్చాయి. ప్రకృతితో మమేకమవుతూ కుటుంబంతో గడపడం చాలా సంతోషాన్నిచ్చింది.

– డాక్టర్ పి.చంద్రశేఖర్

గిరిజనోత్సవం


వస్తువులు కొనుగోలు చేస్తున్న మహిళలు


అలరించిన గిరిజన సంప్రదాయ నృత్యాలు

ఏయూక్యాంపస్: బిర్సాముండా 150వ జయంతిని పురస్కరించుకుని ఆదివారం గిరిజన స్వాభిమాన ఉత్సవాలు ఘనంగా కొనసాగాయి. బీచ్‌రోడ్డు వేదికగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాల్లో గిరిజన సంస్కృతులు, సంప్రదాయాలను ప్రతిబింబిస్తూ నిర్వహిస్తున్న సాంస్కృతిక మేళా అందరినీ ఆకట్టుకుంటోంది. విశ్వప్రియ ఫంక్షన్ హాల్ వద్ద ప్రత్యేక వేదికపై గిరిజన కళాకారులు సంప్రదాయ నృత్యాలను ప్రదర్శించారు. ఆదివాసీ సంస్కృతిని కళ్లకు కట్టినట్లు ప్రదర్శించిన ఈ నృత్యాలు నగరవాసులను, పర్యాటకులను కట్టిపడేశాయి.

మరణించినా మళ్లీ జీవించేలా..

- శరీర, అవయవదానానికి సంసిద్ధత
- 102 మంది అంగీకార పత్రాల అందజేత


శరీర,అవయవ దాన పత్రాలను చూపుతున్న సభ్యులు

భీమునిపట్నం: మనం మరణించినా మళ్లీ జీవించాలని, అప్పుడే జీవితానికి సార్థకత ఉంటుందని అఖిల భారత శరీర అవయవ దాతల సంఘం వ్యవస్థాపక అధ్యక్షురాలు, చైర్‌పర్సన్ గూడూరు సీతామహాలక్ష్మి అన్నారు. కీతిన్‌పేటలోని సన్‌స్కూల్ వద్ద భీమిలి సీడీ వెల్ఫేర్ అసోసియేషన్, లయన్స్ క్లబ్ ఆఫ్ భీమిలి గ్రేటర్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'మరణించినా జీవించండి' కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఎంతోమందికి అవసరమైన అవయవాలు లభించక మరణిస్తున్న పరిస్థితులు ఉన్నాయని, అలాంటి వారిని బతికించి మనం వారిలో జీవించాలని అన్నారు. అపోహలను వీడి అవయవదానానికి ముందుకు రావాలని కోరారు. సీడీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కైతపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ 102మంది సభ్యులు తమ అవయవాలతో పాటు, పార్థివ దేహాన్ని అందించేందుకు అంగీకార పత్రాలను అందిస్తున్నామని తెలిపారు. లయన్స్ క్లబ్, సీడీ వెల్ఫేర్ అసోసియేషన్ ముఖ్య సభ్యులు డాక్టర్ ఎస్.ఎల్.రావు, ముసునూరి శ్రీనివాసరావు, వెంపాడ శ్రీనివాసరెడ్డి, కాళ్ల సన్యాసిరావు, లాయర్ వెంకటేష్, కూరాకుల మురళి, గుగ్గిళ్ల రాజు పాల్గొన్నారు.

నెట్స్‌లో చత్తీస్‌గఢ్ సాధన

విశాఖ స్పోర్ట్స్: వైఎస్ రాజశేఖరరెడ్డి స్టేడియంలో ఆదివారం చత్తీస్‌గఢ్ జట్టు నెట్స్‌లో ప్రాక్టీస్ చేసింది. సయ్యద్ ముస్తాక్ అలీ(ఎస్ఎం) ట్రోఫీలో భాగంగా గ్రూప్ డీ మ్యాచ్‌లకు వైఎస్సార్ స్టేడియం ఆతిథ్యమిస్తున్న సంగతి తెలిసిందే. తొలి రౌండ్ పోటీల్లో విదర్భ, అసోం, చండీగఢ్ జట్లు శుభారంభం చేసి పాయింట్ల ఖాతా ప్రారంభించాయి. ఆదివారం మ్యాచ్‌లకు విశ్రాంతి కావడంతో ఆరు జట్లు భవిష్యత్ ప్రణాళికలు రచించుకోగా, చత్తీస్‌గఢ్ జట్టు సాధన చేసింది. కెప్టెన్ అమన్‌దీప్ జట్టును సమాయత్తం చేశాడు.

నేటి మ్యాచ్‌లు

ఉదయం 11 గంటలు చండీగఢ్ X విదర్భ
సాయంత్రం 4.30 గంటలు చత్తీస్‌గఢ్ X పుదుచ్చేరి

ఆంధ్రా తొలి మ్యాచ్ నేడు

ఆంధ్రా జట్టు హైదరాబాద్‌లో గ్రూప్ ఈలో ఆడేందుకు సమాయత్తమైంది. సోమవారం సాయంత్రం 4.30 గంటలకు నాగాలాండ్‌తో డే నైట్ మ్యాచ్‌గా ఆడనుంది. జట్టుకు విశాఖ ఆటగాడు రికీబుయ్ నాయకత్వం వహిస్తుండగా.. విశాఖకే చెందిన కె.ఎస్.భరత్ వికెట్ల వెనుక నిలవనున్నాడు. గతేడాది గ్రూప్ సీలో ఆడిన ఆంధ్రా ఆరో స్థానంలో నిలిచింది.

ఉత్సాహంగా రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు


పోటీలను ప్రారంభిస్తున్న ఎస్టీ కమిషన్ చైర్మన్ శంకర్రావు

కొమ్మాది: బిర్సాముండా 150వ జయంతిని పురస్కరించుకుని జన జాతీయ గౌరవ దివస్‌లో భాగంగా నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు రెండో రోజు ఆదివారం ఉత్సాహంగా సాగాయి. గాయత్రి పీజీ, డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పోటీలను ఎస్టీ కమిషన్ చైర్మన్ డా.వి.జి.శంకర్రావు ప్రారంభించారు. అనంతరం గిరిజన సాంస్కృతిక పరిశోధన శిక్షణ మిషన్ భవన్ ప్రాంగణంలోని 24 స్టాల్స్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పి.వి.ఎన్.మాధవ్, టీసీఆర్‌టీఎం ఈడీ రాణి మందా పాల్గొన్నారు.

చిన్నారిపై వీధి కుక్కల దాడి

- ఒళ్లంతా గాయాలతో కేజీహెచ్‌లో చికిత్స
- వీధి కుక్కలపై జీవీఎంసీ ఉదాసీన వైఖరి


చిన్నారి యక్షిత వీపుపై కుక్క గాట్లు

అగనంపూడి: గ్రామ సింహాలు చిన్నారిపై దాడి చేసి తీవ్రంగా గాయపర్చిన సంఘటన ఫార్మాసిటీ నిర్వాసిత కాలనీలో చోటుచేసుకుంది. ప్రాణాపాయ స్థితిలో కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న సంఘటన శనివారం రాత్రి జరిగింది. జీవీఎంసీ 85వ వార్డు ఫార్మాసిటీ నిర్వాసిత కాలనీ పానకాలయ్యపేట బోనంగికి చెందిన సిద్ధనాతి నూక అప్పారావు కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. శనివారం రాత్రి అప్పారావు భార్య లక్ష్మి ఇంట్లో పనులు చేసుకుంటుండగా, అప్పారావు పనిమీద బయటకు వెళ్లాడు. అదే సమయంలో వీరి కుమార్తె యక్షిత(3) రోడ్డు మీద ఆడుకుంటోంది. యక్షితపై ఒక్కసారిగా రెండు వీధి కుక్కలు దాడి చేసి ఒళ్లంతా గాయపర్చాయి. శరీరం వెనుక భాగం, మెడ, తలపై కూడా తీవ్రంగా గాట్లు పడ్డాయి. చిన్నారి విలవిలాడుతూ గట్టిగా ఏడ్వడంతో స్థానికులు వచ్చి కుక్కలను తరిమికొట్టి పాపను రక్షించారు. లేకుంటే పెద్ద ప్రమాదమే జరిగేది. తల్లిదండ్రులు హుటాహుటిన చిన్నారిని కేజీహెచ్‌కు తరలించారు. ప్రస్తుతం యక్షిత కేజీహెచ్‌లో చికిత్స పొందుతోంది. ప్రాణాపాయ స్థితి తప్పిందని వైద్యులు చెప్పారు.

జీవీఎంసీ ఉదాసీనత

వీధి కుక్కలు గుంపులుగా సంచరిస్తూ స్థానికులు భయపెడుతున్నా జీవీఎంసీ యంత్రాంగం ఉదాశీనంగా వ్యవహరించడంపై స్థానికులు మండిపడుతున్నారు. ఓ పక్క వీధి కుక్కలు, మరోపక్క పందులు నిర్వాసిత కాలనీల్లోని వీధుల్లో యథేచ్ఛగా సంచరిస్తున్నాయి. ఎవరైనా వీటికి ఎదురుపడితే దాడి చేస్తున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జీవీఎంసీ ప్రజారోగ్య విభాగం స్పందించి తక్షణం కుక్కల నియంత్రణకు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

అగ్రిగోల్డ్ బాధితులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి


సదస్సులో మాట్లాడుతున్న సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు

అల్లిపురం: అగ్రిగోల్డ్ బాధితులకు ఇచ్చిన హామీలను త్వరితగతిన నెరవేర్చాలని అగ్రి గోల్డ్ బాధితుల సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. అల్లిపురం సీపీఐ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విశాఖ జిల్లా అగ్రిగోల్డ్ బాధితుల సదస్సులో ఆయన మాట్లాడారు. బాధితుల కోసం ఫాస్ట్ ట్రాక్ కోర్టును ఏర్పాటు చేయాలని, అందులో ప్రతిరోజు విచారణ జరిపించాలని, స్పెషల్ పర్పస్ వెహికల్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అన్యాక్రాంతమైన అగ్రిగోల్డ్ అటాచ్‌మెంట్ ఆస్తులను రక్షించాలన్నారు. సమస్యలను త్వరితగతిన పరిష్కరించకుంటే మరో ఉద్యమానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి తిరుపతిరావు, రాష్ట్ర అధ్యక్షుడు ఈవీ నాయుడు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి అచ్యుతరావు, జిల్లా అసోసియేషన్ నాయకులు మధు, కోటేశ్వరరావు, ప్రసాద్, పాత్రుడు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఎనర్జీ ఎక్స్‌పో

విశాఖ విద్య: ఏపీ సోలార్ ఎనర్జీ అసోసియేషన్ ఆధ్వర్యంలో రీ నెక్స్ట్ పేరుతో నిర్వహించిన సోలార్ రెన్యూవబుల్ ఎనర్జీ ఎక్స్‌పో 2024 ముగిసింది. అసోసియేషన్ అధ్యక్షుడు హేమ కుమార్ మాట్లాడుతూ మూడు రోజుల పాటు నలభై స్టాల్స్‌తో నిర్వహించిన ఎక్స్‌పోకు విశేష ఆదరణ లభించిందన్నారు. కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన సూర్య ఘర్ పథకంపై విశాఖ ప్రజలు ఆసక్తి చూపించారన్నారు. ఇదే ఉత్సాహంతో రాష్ట్రవ్యాప్తంగా మరిన్ని ఎక్స్‌పోలు నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందిస్తామన్నారు.

సాగరతీరం కిటకిట

సాగరతీరం ఆదివారం సందడిగా మారింది. ఆర్.కె.బీచ్, రుషికొండ, యారాడ, భీమిలి బీచ్‌లు పర్యాటకులతో కిటకిటలాడాయి. బీచ్‌లో స్నానాలు చేస్తూ ఉత్సాహంగా గడిపారు. ఆట పరికరాలతో పిల్లలు ఆడుకుంటూ కేరింతలు కొట్టారు. యువత సెల్ఫీలు తీసుకుంటూ సంబరపడింది. పెద్దలు, వృద్ధులు కబుర్లతో కాలక్షేపం చేశారు.

-ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం


రుషికొండ తీరంలో సందడి

దైనందిన జీవితంలో క్రీడలు భాగం కావాలి

- డీఐజీ గోపీనాథ్ జెట్టి
- ముగిసిన పోలీసుల వార్షిక స్పోర్ట్స్ మీట్


విజేతలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న విశాఖ రేంజ్ డీఐజీ గోపినాథ్ జెట్టి

ఆరిలోవ: పోలీసులు దైనందిన జీవితంలో క్రీడలు, వ్యాయామాన్ని భాగం చేసుకోవాలని విశాఖ రేంజ్ డీఐజీ గోపినాథ్ జెట్టి సూచించారు. శారీరక దృఢత్వాన్ని కాపాడుకోవడానికి ఏదో ఒక వ్యాయామం, క్రీడను తప్పనిరిగా అలవాటు చేసుకోవాలన్నారు. నగరంలోని విశాలాక్షినగర్ ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్ పోలీస్ మైదానంలో అనకాపల్లి జిల్లా పోలీసులకు ఈ నెల 22న ప్రారంభించిన వార్షిక స్పోర్ట్స్ మీట్-2024 ఆదివారం ముగిసింది. అథ్లెటిక్స్, వాలీబాల్, కబడ్డీ, షటిల్ బ్యాడ్మింటన్, టగ్ ఆఫ్ వార్ తదితర అంశాల్లో పోటీలు నిర్వహించారు. విజేతలకు అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హాతో కలసి ఆయన బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పోలీసులు ప్రతిరోజూ చురుగ్గా విధులు నిర్వహించడానికి క్రీడలు దోహదపడతాయన్నారు. క్రీడలు విజయవంతంగా నిర్వహించిన అధికారులను అభినందించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు ఎం.దేవ ప్రసాద్, ఎల్.మోహన్‌రావు, అనకాపల్లి సబ్ డివిజన్ డీఎస్పీ ఎం.శ్రీవాణి, పరవాడ సబ్ డివిజన్ డీఎస్పీ కె.వి సత్యనారాయణ, ఏఆర్ డీఎస్పీ పి.నాగేశ్వరరావు, ఎ.ఆర్. ఇన్‌స్పెక్టర్లు మన్మథరావు, రామకృష్ణారావు, రమణమూర్తి, సంజీవిరావు, సిబ్బంది పాల్గొన్నారు.

నేత్రపర్వం.. నృత్యోత్సవం


జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అతిథులు, నిర్వాహకులు

మద్దిలపాలెం: హేరంబ డ్యాన్స్ ఫెస్టివల్-2024 నృత్యరూపక ప్రదర్శనలు కళాప్రియులు హృదయాలను అబ్బురపరిచాయి. నిపుణుల కూచిపూడి నాట్య కచేరీలు నయనమనోహరంగా సాగాయి. కళాభారతి ఆడిటోరియంలో నగరానికి చెందిన నాట్యసన్నిధాలయ నృత్య సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం హేరంబ డ్యాన్స్ ఫెస్టివల్- 2024 మనోరంజకంగా జరిగింది. యువ కూచిపూడి నాట్యాలయ వ్యవస్థాపకురాలు సన్నిధ రాజసాగి సారథ్యంలో జరిగిన ఈ కూచిపూడి సంప్రదాయ నృత్యోత్సవం అద్భుతంగా సాగింది. నగరానికి చెందిన డాక్టర్ వెంపటి చినసత్యం కూచిపూడి కళాక్షేత్ర విద్యార్థి గణేశ స్తుతితో ప్రదర్శనలకు శ్రీకారం చుట్టారు. ఆ తర్వాత వారి బృందం హరిరారు మూర్తి పర్యవేక్షణలో చక్కటి సమన్వయంతో ప్రదర్శనల్పి రసజ్ఞుల హర్షధ్వానాలందుకుంది. నాట్య సన్నిధాలయ విశాఖ బృందం మోహినీ భస్మాసుర నుంచి దశావతారాలు అంశాన్ని చక్కగా ప్రదర్శించి ప్రశంసలందుకుంది. చెన్నైకి చెందిన శివ మోహన డ్యాన్స్ స్కూలు విద్యార్థులు, హైదరాబాద్‌కు చెందిన లాస్యకల్ప బృందం ప్రదర్శించిన నృత్యాలు అదరహో అనిపించాయి. ఈ సందర్భంగా ఫెస్టివల్ డైరెక్టర్ సన్నిధ మాట్లాడుతూ ఈ తరహా ఉత్సవాలు మన ప్రాచీన సాంస్కృతిక వారసత్వానికి జవసత్వాలిస్తాయన్నారు. లారస్ ల్యాబ్స్ సీఈవో డాక్టర్ సత్యనారాయణ, కళాభారతి కార్యదర్శి జీఆర్కే ప్రసాద్, అధ్యక్షుడు ఎంఎస్ఎన్ రాజు, డ్యాన్స్ ఇండియా ఆంగ్ల మాసపత్రిక సంపాదకుడు బత్తిన రంగ విక్రమ్ కుమార్, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ నృత్య విభాగ గాత్ర నిపుణుడు డీఎస్వీ శాస్త్రి, కూచిపూడి కళాక్షేత్ర ప్రిన్సిపాల్ హరిరామమూర్తి ప్రసంగించారు. సంస్థ విద్యార్థిని హైందవి చక్కటి వ్యాఖ్యానంతో కార్యక్రమాన్ని రక్తికట్టించారు.

రాజ్యాంగం అమలుతో సమానత్వం


ర్యాలీలో పాల్గొన్న నగరవాసులు, యువత

ఏయూక్యాంపస్: రాజ్యాంగం అమలుతో సమాజంలో అసమానతలు రూపుమాపడం సాధ్యపడిందని వక్తలు అభిప్రాయపడ్డారు. రాజ్యాంగ దినోత్సవం పురస్కరించుకుని భీమ్‌సేన ఆధ్వర్యంలో ఆదివారం సాగరతీరంలో రన్ ఫర్ అంబేడ్కర్ కార్యక్రమం జరిగింది. ఆర్.కె బీచ్ నుంచి వైఎంసీఏ వరకు వందలాది మంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ముందుగా వాహనంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ నిలువెత్తు విగ్రహం వెళుతుండగా.. వెనుకనే నగర యువత నడిచారు. ముందుగా ఈ ర్యాలీని విశ్రాంత ఐఆర్ఎస్ అధికారి టి.ఎస్.ఎన్ మూర్తి, ప్రముఖ విశ్లేషకుడు పి.వి.ఆర్ మోహనరావు జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం వైఎంసీఏ వద్ద నిర్వహించిన ముగింపు సమావేశంలో భీమ్‌సేన వ్యవస్థాపకుడు మామిడి రవి సిద్ధార్థ మాట్లాడారు. రాజ్యాంగ దినోత్సవం పురస్కరించుకుని ఏటా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 10వ రన్ ఫర్ అంబేడ్కర్ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన వచ్చిందన్నారు. సమాజంలో ఉన్నతంగా రాణించడానికి, వ్యక్తి ప్రగతికి విద్య ఒక సాధనంగా నిలుస్తుందన్నారు. అనంతరం ప్రజలతో రాజ్యాంగ పీఠికను చదివించారు. అతిథులను సత్కరించి, జ్ఞాపికలను బహూకరించారు.